క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజలకు మహిళా భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రాంగణంలో ఉన్న రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి, అమ్మవారి ప్రతిమ వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

గంట్యాడ: దళారులకు ధాన్యం విక్రయించొద్దని ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులకు ధాన్యం విక్రయించడం వల్ల మద్దతు ధర పొందలేరని అన్నారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది రైతుల కళ్లాల వద్దకు వెళ్లి శాంపిల్ సేకరించాలని సూచించారు. ట్రక్ షీట్‌లు ఏరోజుకు ఆరోజు జనరేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ కచ్చితంగా అమలు చేయడంతో పాటు నాణ్యత, రుచి, శుచి పాటించాలని ఎంఈఓ-1 జగదీశ్వరరావు నిర్వాహకులకు సూచించారు. గుడివాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల వర్క్‌బుక్స్, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ జి.గిరిబాల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మరువాడ నుంచి ఎం.కొత్తవలస గ్రామానికి వెళ్లే సీసీరోడ్డు పనులతో పాటు గ్రామంలో రెండు ప్రధాన వీధుల్లో చేపట్టిన సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ బి.కృష్ణవేణి, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ కె.తులసీరాం, గ్రామ సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలపై ఆరా..

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై పౌర వేదిక బృంద సభ్యులు శుక్రవారం ఆరా తీశారు. సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడుతో సమావేశమై ఆస్పత్రిలో అందాల్సిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఔట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల సంఖ్య బాగా పెరిగిందన్నారు. కొన్ని విభాగాల్లో వైద్య సేవలు సక్రమంగా అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు రోగులు, అధికారులు, వైద్యులతో సమావేశమై జరుగుతున్న పరిణామాలపై నివేదిక రూపొందించి కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యేకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రొంగలి పోతన్న, రామచంద్రరాజు, రామ్మోహన్, కనకచారి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఫెంగల్ గండం



గజపతినగరం: లోగీశలో రెల్ల తొలిచే పురుగు ప్రభావంతో రాలిపోయిన వరి కంకెలను కూడబెట్టిన దృశ్యం



గజపతినగరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో కోసిన వరిపంటను పొలంలోనే కుప్పలుగా పెడుతున్న రైతులు



బొండపల్లి సమీపంలో కురుస్తున్న వర్షం

గజపతినగరం: ఖరీఫ్ వరిసాగు కోతదశకు చేరుకుంది. రైతులు పంటకోతలకు సన్నద్ధమవుతున్న దశలో రెల్లరాల్పు తెగులు వ్యాప్తి, వాతావరణశాఖ మార్పులు అన్నదాతను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని లోగీశ, దావాలపేట, పురిటిపెంట, పాతబగ్గాం, బంగారమ్మపేట, ముచ్చర్ల, రంగుపురం, శ్రీరంగ రాజపురం, తదితర గ్రామాల్లో పంట కోతలు పూర్తయ్యాయి. ఈ దశలో తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాలకు పరుగులు తీస్తున్నారు. వరి పనలను పొలంలోనే కుప్పలుగా పెడుతున్నారు. ఇప్పటికే నూర్పులు పూర్తిచేసిన వారు కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇప్పటికే రెల్లరాల్పు పురుగ ప్రభావంతో వరి కంకెలు రాలిపోయి దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఒక పక్క అల్పపీడన ప్రభావంతో వర్షాలు, మరోపక్క రెల్ల తొలిచే పురుగు ప్రభావం వల్ల అన్నదాతలు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ అనురాధ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. వరి కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలని దండోరా వేయించారు. ఎక్కడైనా వర్షాలకు పంటలు తడిచిపోతే వీఏఏలకు సమాచారం అందించాలని సూచించారు.

మండలం వ్యాప్తంగా కురుస్తున్న వర్షం

బొండపల్లి: తుఫాన్ ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. పొలాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ వచ్చి నష్టాన్ని తెచ్చేలా ఉందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు.



గంట్యాడ: మురపాక గ్రామంలో వరిచేను కుప్పగా పెడుతున్న రైతులు

అన్నదాతలో తుఫాన్ అలజడి

గంట్యాడ: తుఫాన్ కారణంగా శుక్ర, శని వారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటనతో రైతన్నల్లో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టించి పండించిన వరిపంట పొలాల్లో ఉండడంతో తడిచిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు పొలాలకు పరుగులు తీశారు. కోసిన వరి చేనును కుప్పలుగా పెట్టే పనిలో నిమగ్నమయ్యారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ర్యాలీ చేస్తున్న వెలుగు, గ్రామైక్య సంఘం మహిళలు

గజపతినగరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసిన, వాటిని ప్రోత్సహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెలుగు ఏపీఎం లోపింటి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దావాలపేటలో శుక్రవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలను ప్రజలకు వివరించారు. కౌమారదశలోనే బాలికలు గర్భం దాల్చడం వల్ల అబార్షన్ అయ్యే అవకాశం అధికంగా ఉంటుందని, దీని వల్ల బాలికల ఆరోగ్యం క్షీణిస్తుందని అన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ కె.నరసింహమూర్తి, గ్రామసంఘం అధ్యక్షుడు పొందూరు సంతోషి, కార్యదర్శి దావాల త్రినాథ, వీఓఏ వి.అప్పలనరసమ్మతో పాటు గ్రామపెద్దలు వి.తిరుపతిరావు, ఎం.అప్పలసూరి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నేటి లేగదూడలే రేపటి పాడిఆవులు



పాడిరైతులకు బహుమతులు అందజేస్తున్న ఏడీ వై.వి.రమణ

కొత్తవలస: నేటి లేగదూడలే రేపటి పాడిఆవులని, లేగదూడలకు పోషకాలతో కూడిన దాణా అందించి వాటిని సంరక్షించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు వై.వి.రమణ అన్నారు. మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 47 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన మందులు అందజేశారు. అలాగే 43 మంది పాడిరైతులు తమ లేగదూడలను ప్రదర్శనకు తీసుకు రాగా అందులో పుష్టిగా, ఏపుగా, ఆరోగ్యంగా ఉన్న మూడు లేగదూడలను ఎంపిక చేసి సంబంధిత రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ గంగాధర్, ఎల్.కోట, దెందేరు పశువైద్యాధికారులు గాయత్రి, ప్రదీప్‌నాయుడు, గ్రామ సర్పంచ్ జామి ఈశ్వరరావు, పలువురు గోపాల మిత్రలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల సత్తా



పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థినులతో పాటు పీఈటీ అరుణ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. పెదవేగి గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పోటీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని సౌమ్య ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. అలాగే 4 100 రిలే పరుగు పోటీలో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. విద్యార్థినులతో పాటు పీఈటీ అరుణను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



గాదెలమర్రివలసలో తాగునీటి పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ దేవ

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస పంచాయతీకి సంబంధించిన ప్రధాన తాగునీటి పైపులైను కొన్నిరోజుల కిందట పాడైంది. అప్పటి నుంచి గాదెలమర్రివలస, బడ్నాయునివలస గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ అట్టాడ దేవ వెంటనే స్పందించారు. శుక్రవారం పైపులైన్ మరమ్మతు పనులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. తాగునీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: నిరుద్యోగ యువతీ, యువకులకు వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ), ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో వచ్చిన ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. కష్టపడి పనిచేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జాబ్‌మేళాలో అరబిందో ఫార్మా, డెక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమలతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 90 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా వారిలో 36 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో 16 మంది వరకు ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ కె.ఉషాజ్యోతి, మెంటార్ అమర్ లింగం, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్‌షాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)లో భాగంగా స్మార్ట్‌హోస్, రోబోటిక్, ఏరో తదితర అంశాలపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో విశాఖపట్నం అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ భానుతేజ విద్యార్థులకు నూతన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో మొదటి రోజు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఏరో అంశాలను వివరించారు. రెండో రోజు శనివారం ఈ అంశాలపై విద్యార్థులతో ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నసమరాధన

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో ఉన్న కాశీవిశేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 6 వేల మంది భక్తులకు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న అప్పారావు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఏపీ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు గంటాన అప్పారావు కోరారు. ఆరో తరగతి నుంచి పీజీ వరకు అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలనే డిమాండ్‌తో ఏపీ దళిత మహాసభ చేపడుతున్న లక్ష కార్డుల ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామ పంచాయతీలో అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలు, స్మృతివనాలు ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడలో ఉన్న అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. అంబేడ్కర్ పేరుతో అవార్డు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేగాన చిట్టిబాబు, మిరియాల కృష్ణారావు, మామిడి శ్రీనివాసరావు, ఈశ్వరరావు, మురళి, నాగరాజు, జగదీశ్వరరావు, లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జానపద జాతర కళలకు ఊపిరి



జానపద జాతరలో జముకులపాట ప్రదర్శనలో బొంతల బృందం(ఫైల్)

వేపాడ: తెలంగాణా రాష్ట్రంలో నిర్వహించిన జానపద జాతరలో విజయనగరం జిల్లాకు ప్రాధాన్యత కల్పించటంపై గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు హర్షం వ్యక్తంచేశారు. ఎస్.కోట సీతారాంపురంలో శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అంతరించిపోతున్న ప్రాచీన జానపద కళారూపాలైన జముకులపాట, తుర్పు భాగవతంను తెలంగాణ జనపద జాతరలో ప్రదర్శనకు అవకాశం రావడం హర్షనీయమన్నారు. జాతీయ స్థాయిలో రెండేళ్లకోసారి జరిగే ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద కళలకు అవకాశం కల్పిస్తారని, అందులో బొంతలకోటి శంకరరావు బృందం ప్రదర్శించిన జముకులపాట, తూర్పుభాగవతం ఆహూతులను ఆకట్టుకున్నాయన్నారు. ప్రదర్శన అనంతరం కళాకారులను, బృంద నాయకులను నిర్వాహకులు సన్మానించి అభినందించినట్లు తెలిపారు. ఇటువంటి ప్రదర్శనలు జానపద కళలకు ఊపిరి పోస్తాయన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థులను ఎ-గ్రేడ్‌కు తీసుకొచ్చేందుకు కృషిచేయాలని ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం వర్చువల్ విధానంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి నివేదికలు వారికి తెలియజేయాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న వసతులు, విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభ పద్ధతుల్లో బోధన చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ విమలమ్మ, సాయిచక్రధర్, అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువుల రక్షణతోనే భవిష్యత్‌కు భరోసా



చెరువుల పరిరక్షణ పేరుతో ముద్రించిన టీషర్టులు విడుదల చేస్తున్న ప్రతినిధులు

చీపురుపల్లి: చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యుడు జాగరపు ఈశ్వరప్రసాద్ అన్నారు. జలవనరుల పరిరక్షణ యాత్రలో భాగంగా కందివలస గెడ్డ పరిరక్షణ కోసం శుక్రవారం నుంచి యాత్ర చేపట్టారు. పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరివిడి మండలంలోని మందిరవలస వద్ద ప్రారంభమయ్యే కందివలస గెడ్డ శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం గొల్లలపాలెం వద్ద బంగాళాఖాతంలో కలుస్తోందన్నారు. కందివలస గెడ్డ ఇప్పటికే ఆక్రమణలకు గురవడంతో పాటు కలుషితమవుతోందన్నారు. గెడ్డను పరిరక్షించుకునేందుకు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జలవనరుల పరిరక్షణ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లకు నివేదిక సమర్పించనున్నట్లు చెప్పారు. భావితరాలకు జలవనరులను అందించేందుకు ఉత్తరాంధ్ర చెరువుల సమితి ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జలవనరుల పరిరక్షణ పేరుతో ముద్రించిన టీషర్టులను విడుదల చేశారు. ఇప్పటికే ఆక్రమణలకు గురైన జలవనరులను గుర్తించి ఆయా గ్రామాల ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ప్రధాన ధ్యేయంగా ఈ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు భరతానంద స్వామీజీ, ఉద్యమ అధ్యక్షురాలు జీఆర్‌సీ సంధ్యారాణి, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



దత్తిరాజేరు కేజీబీవీలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న టీం సభ్యులు

దత్తిరాజేరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని అకడమిక్ మోనటరింగ్ డైరెక్టర్ ఈశ్వరరరావు అన్నారు. దత్తిరాజేరు కేజీబీవీ, దత్తి ఉన్న ఉన్నత పాఠశాల, ఇంగిలాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను అకడమిక్ మోనటరంగ్ టీం సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్ఏఎస్ సర్వే, పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ కార్యక్రమాలను ఎంపిక చేయబడిన పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని అన్ని పాఠశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బృంద సభ్యులు రామకృష్ణ, కె.గాయంత్రి, ఎంఈఓ-2 సుధాకర్ పాల్గొన్నారు.

'మెగా పేరెంట్స్ డే'ను విజయవంతం చేయండి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే 'మెగా పేరెంట్స్ డే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కోన శశిధర్, ఎస్‌పీడీ శ్రీనివాసరావు హెచ్ఎంలకు సూచించారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు, మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. డిసెంబరు 7న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ప్రొగ్రెస్‌ను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబరు 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించాలని ఎంఈఓ-1 చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమయ్యారు. మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులను సిద్ధం చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కమిటీలు వేసి అందరు పేరెంట్స్ మీటింగ్‌కు హాజరయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ-2 ధర్మశ్రీను పాల్గొన్నారు.



లక్కవరపుకోట: మండలంలోని రేగ సమీపంలో ఉన్న గొంగలేశ్వరస్వామి కొండ, కొండ చుట్టూ పసిడి వర్ణం సంతరించుకున్న వరి పొలాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. కార్తీకమాసం కావడంతో పలువురు సందర్శకులు ఈ కొండ వద్దకు పిక్నిక్‌కు వస్తున్నారు. బంగారు వర్ణంలోని పంటపొలాలు, దూరంలో ఉన్న గొంగలేశ్వరస్వామి కొండ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.